## క్లుప్తంగా

### వైభవంగా నూకాలమ్మ జాతర

**మామిడికుదురు:** గ్రామ దేవత శ్రీనూకాలమ్మ జాతర గురువారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, తీన్‌మార్ విన్యాసాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర ఆద్యంతం కనుల పండువలా జరిగింది. వేలాది భక్తులు జాతరలో పాల్గొన్నారు. శుక్రవారం అమ్మవారికి భక్తులు నైవేద్యాలు చెల్లించారు. మంగళవారం వరకు అమ్మ వారి జాతర జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం

**అయినవిల్లి:** మండలంలోని వీరవల్లిపాలెం గ్రామదేవతగా పూజలందుకుంటున్న ముసల మ్మవారి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వ ర్యంలో అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరిపారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి కానుకలు, మొక్కులు చెల్లిం చారు. అలాగే సిరిపల్లమ్మకి గురువారం రాత్రి ఘనంగా జాతర జరిపారు.

### ఉగాది పాట ఆవిష్కరణ

**మలికిపురం:** శరణ్య ఈవెంట్స్ సారథ్యంలో ఆద్య ప్రొడక్షన్స్ రూపొందించిన 'వెన్నెలని తెచ్చింది' ఉగాది సాంగ్ ప్రోమోను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శుక్రవారం విశ్వేశ్వరాయపురం లో జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లా డుతూ, ప్రోమోలో రూప కల్పనతో పాటు టెక్నికల్ అంశాలు చాలా బాగున్నాయని ప్రశం సిస్తూ, సాంగ్ సక్సెస్ అవ్వాలని టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రోమో టీమ్‌తో పాటు స్థానిక జగదీశ్వరి ఐటీఐ అధినేత ఎ.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### సంపూర్ణ పారిశుధ్యాన్ని నెలకొల్పాలి

**ఆలమూరు:** గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు వీలుగా ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.శ్రీకాంత్, డి.సాయికిషోర్ అన్నారు. ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకో వలసిన చర్యలను వివరించారు. వ్యక్తిగత పరి శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెల కొల్పాలని ప్రజలను కోరారు. సీహెచ్‌ఓ ఎంఎ స్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనా రాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి తదిత రులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

### పది పరీక్షల కేంద్రం పరిశీలన

**అయినవిల్లి:** ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశా లలో పది పరీక్షల కేంద్రాన్ని రామచంద్రపురం డీవైఈఓ, స్క్వాడ్ పి.రామలక్ష్మణరావు శుక్ర వారం పరిశీలించారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులను తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాం తంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పరీక్షల కేంద్ర చీఫ్, ఇన్విజిలేటర్లకు సూచనలు చేశారు.

### వైస్ ఎంపీపీ-2 ఆంజనేయులుకు సత్కారం



ఉయ్యూరువారి మెరకలో సత్కారం అందుకున్న ఆంజనేయులుతో ప్రముఖులు

**సఖినేటిపల్లి:** మండలంలోని ఉయ్యూరువారి మెరక-2 ఎంపీటీసీ గుబ్బల ఆంజనేయులు వైస్ ఎంపీపీ-2గా ఎన్నికై న నేపథ్యంలో సదరు గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ మేరకు పంచాయతీలో ఆంజనేయులను సర్పంచ్ ఓగూరి రత్న కుమారి సత్కరించారు. ప్రముఖులు, గ్రామ స్తులు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్యలను అధిగమిస్తున్నాం



గుడిమెళ్లంకలో వాటర్ ట్యాంకును ప్రారంభించిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

**మలికిపురం:** రాజోలు నియోజకవర్గంలో తాగునీటి సమస్యలకు అధిగమిస్తున్నామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొ న్నారు. మలికిపురం మండలంలో రూ.కోటి 53 లక్షలతో గుడిమెళ్లంక, మట్టపర్రు, బట్టే లంక, తూర్పుపాలెం (కాలనీ)లలో 4 వాటర్ ట్యాంక్‌లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ప్రాజెక్టులకు విద్యుత్ కోత లేకుండా ఆపదను విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. నాయకులు గుండు బోగుల పెదకాపు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, దిరిశాల బాలాజీ, సర్పంచ్‌లు నల్లి విజయకుమారి, చెల్లింగి సత్యనా రాయణ, నల్లి ప్రసాద్ తదితరులు పాల్గొ న్నారు.

# ఆకుకూరలతో సంపూర్ణ ఆరోగ్యం

- పుష్కలంగా విటమిన్లు, పోషకాలు
- కోవిడ్ తరువాత పెరిగిన వినియోగం
- అందుబాటు ధరల్లో లభ్యం

**ఆలమూరు:** సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ ఆహారపు అలవాట్లు మార్చుకుంటున్నారు. జీవవ విధానాన్ని సరళతరం చేసుకుని 'ఆరోగ్యమే మహా భాగ్యం' అనే ప్రక్రియకు జీవం పోస్తున్నారు. ఇటీవల బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రభావంతో చికెన్ విక్రయాలు తగ్గిపోవడంతో అనేక మంది మాంసాహారులు ఆకుకూరలను వినియోగించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. అందులో భాగంగా పప్పుదినుసులతో పాటు 'రక్షిత ఆహారం'గా భావించే ఆకుకూరలను విరివిగా ఉపయోగిస్తున్నారు. పోషక విలువలు, విటమిన్లు అధికంగా ఉండి అందుబాటు ధరల్లో లభించే ఈ ఆకుకూరలను కొనుగోలు చేయడానికి అన్ని వర్గాల ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆకుకూరల్లో ఎక్కువగా ఇనుము ధాతువులు, ఖనిజ పోషకాలు అధికంగా ఉంటాయి. ప్రజల అభిరుచిని గమనించిన చిరు వ్యాపారులు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోను ద్విచక్ర వాహనాలపై తాజా ఆకుకూరలను తీసుకుచ్చి ఉదయాన్నే విక్రయించడం పరిపాటిగా మారింది. దీంతో పట్టణ ప్రాంతాలకు దీటుగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆకుకూరల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది.

**విస్తృతంగా ఆకుకూరల సాగు**

కోనసీమ జిల్లాలోని లంక ప్రాంతాల్లో విరివిగా ఆకుకూరల సాగు జరుగుతుంది. లంక ప్రాంతాల వెంబడి రైతులు సుమారు మూడు వేల ఎకరాల్లో సాగు చేసిన ఆకుకూరలను మడికి, రావులపాలెం, రాజమహేంద్రవరం తదితర మార్కెట్లకు సరఫరా జరుగుతుంది. జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సుమారు ఐదు వేల ఎకరాల్లో ఆకుకూరల సాగు జరుగుతుంది. ఆలమూరు మండలంలోని మడికి అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌కు అనునిత్యం సీతానగరం, రాజమహేంద్రవరం రూరల్, కడియం, ఆలమూరు, ఆత్రేయపురం, కపిలేశ్వరపురం మండలాల నుంచి ప్రతి రోజు టన్ను మేర ఆకుకూరలు రైతులు తీసుకువచ్చి విక్రయాలు జరుపుతారు.



ఆకుకూరలు

**పోషక విలువలు పుష్కలం**

తోటకూర, గోంగూర, పాలకూర, చుక్కకూర, పుదీనా, మెంతికూర, కొత్తిమీర, కరివేపాకు, మునగాకులు, తదితర ఆకుకూరలు అనునిత్యం అందుబాటు ధరల్లో మార్కెట్లో లభిస్తున్నాయి. ప్రస్తుత వర్షాకాలం సీజన్ కొనసాగుతుండటంతో పొన్నగంటి కూర, పాలకూర, మెంతికూర, బచ్చలి కూర ఎక్కువ మొత్తంలో మార్కెట్‌కు వస్తున్నాయి. ఆకుకూరల్లో ఏ,సీ, బీ కాంప్లెక్స్ విటమిన్లు, మెగ్నీషియం, ఐరన్, కాల్షియం, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు, పీచు పదార్థాలు ఉంటాయి. రోగ నిరోధక శక్తి పెరుగుదలకు, ఎముకల్లో కాల్షియం సాంద్రత పెంచేందుకు, ఊబకాయం తగ్గించేందుకు, రక్తహీనత నివారణకు ఆకు కూరలు ఉపయోగించాలని వైద్యులు చెబుతున్నారు. ఆకుకూరలను ఆహారంగా తీసుకోవడం ద్వారా లభించే విటమిన్లు వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

**అపోహలు వద్దంటున్న వైద్య నిపుణులు**

కొన్ని రకాల ఆకుకూరలు తింటే అనారోగ్యాలు కలుగుతాయన్న అపోహలను పరిగణనలోకి తీసుకోవద్దని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆ సందేహాలను నివృత్తి చేసే ప్రయత్నం చేస్తున్నారు. గోంగూర తింటే వేడి చేస్తుందని, కీళ్ల నొప్పులు, వాతం వస్తాయని, పాలకూర తింటే కిడ్నీలో రాళ్లు పెరుగుతాయనే భావన నిజం కాదంటున్నారు.

**పోషక విలువలు అత్యధికం**



పచ్చని ఆకుకూరల్లో కాల్షియం, బీటాకెరోటిన్, విటమిన్–సీ తదితర విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. ఆకు కూరలను ఎక్కువగా ఉడికించకుండా తింటే ఆరోగ్యానికి మంచిది. కంటి జబ్బులు, రక్తహీనత తదితర రోగాలను దూరం చేయవచ్చు. చక్కెర వ్యాధిగ్రస్తులు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోంటే వ్యాధి నియంత్రణలో ఉంటుంది.

– డి.సాయికిషోర్, పీహెచ్‌సీ వైద్యాధికారి, పెదపళ్ల

## ఉప సర్పంచ్‌కు మాజీ ఎమ్మెల్యే అభినందనలు

**ఆలమూరు:** మండలంలోని మోదుకూరు ఉప సర్పంచ్‌గా ఎన్నికైన గొడితి దొరబాబుకు కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అభినందనలు తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈనెల 17న జెంటిల్‌మెన్ ఒప్పందంలో భాగంగా ఖాళీ అయిన ఉప సర్పంచ్ పదవికి ఎన్నిక జరిగింది. ఈ ఉప సర్పంచ్ ఎన్నికల్లో అధికార కూటమి పార్టీ ప్రలోభాలకు చెక్ పెడుతూ టీడీపీ సానుభూతిపరుడైన అభ్యర్థిని ఓడించి వైఎస్సార్ సీపీ నేత దొరబాబు ఘన విజయం సాధించారు. అందులో భాగంగా ఉప సర్పంచ్‌గా ఎన్నికైన దొరబాబు స్థానిక నాయకులతో కలసి మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా గోపాలపురంలోని ఆయన నివాసంలో శుక్రవారం కలిశారు. గ్రామంలో ప్రతిష్టాత్మకమైన రీతిలో జరిగిన ఈ ఎన్నికలో విజయబావుటా ఎగురవేసిన దొరబాబుకు, పార్టీ శ్రేణులపై మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఈ విజయం నాంది పలకాలని ఆయన ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నేతలు నల్లి రాజు, పెంటపాటి వెంకట్రావు, జద్దు సతీష్, దుప్పలపూడి రమేష్, కొండేపూడి సురేష్, దూడల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



ఉప సర్పంచ్‌గా ఎన్నికైన దొరబాబును అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

## డ్వాక్రా మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

**ఆలమూరు:** పేద, మధ్య తరగతి, సామాన్య మహిళల జీవనోపాధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ పథకాలు, రాయితీలు సద్వినియోగం చేసుకుని స్వయం సమృద్ధి సాధించాలని మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు, మాజీ ఎంపీపీ కొత్తపల్లి ధనలక్ష్మి అన్నారు. ఆలమూరులోని స్త్రీశక్తి భవనంలో ఏపీఎం ఎం.ధనరాజు అధ్యక్షతన డ్వాక్రా మహిళల జీవనోపాధి-ప్రణాళిక తయారీ అనే అంశంపై శుక్రవారం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ధనలక్ష్మి హాజరై వెలుగు శాఖ అధికారులతో కలసి యానిమేటర్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. డ్వాక్రా మహిళలందరి జీవనోపాధి కల్పించడంతో పాటు అర్హులైన వారందరికీ రాయితీపై రుణాలు అందించే విధంగా ప్రణాళికను సిద్ధం చేసి నివేదికను రూపొందించాలన్నారు. రుణం తీసుకున్న మహిళలందరూ స్వయం ఉపాధి కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా జీవనోపాధి కల్పించడమే ధ్యేయంగా యానిమేటర్లు, ఎన్యూమరేటర్లు పనిచేయాలని ఎంఎంఏ ధనలక్ష్మి, ఏపీఎం ధనరాజు తెలిపారు. అనంతరం గ్రామాల వారీగా డ్వాక్రా సంఘ వివరాలను, రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న డ్వాక్రా సంఘాల వివరాలను జేఏ ఎంఎస్ కుమార్ అడిగి నమోదు చేసుకున్నారు.



డ్వాక్రా మహిళల జీవనోపాధి కల్పనపై యానిమేటర్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇస్తున్న వెలుగుశాఖ

## సహకార సంఘాలకు ఎన్నికలు జరపాలి

**మలికిపురం:** రామరాజులంక సొసైటీ భవనంలో సంఘ పర్సన్ ఇన్‌చార్జ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ గుబ్బల మురళీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన శుక్రవారం సంఘ మహాజన సభ జరిగింది. 2025–26 సంవత్సరానికి ప్రతిపాదించిన అంచనా బడ్జెట్ ఆమోదించారు. అంచనా బడ్జెట్ రూ.8 కోట్ల ఐదు లక్షల 50 వేలకు గానూ ఇప్పటివరకు సొసైటీ ఇచ్చిన రుణాల మొత్తం రూ.6.39 కోట్లుగా డిపాజిట్ రూపంలో సేకరించిన మొత్తం 48 లక్షలుగా ఆమోదించారు. 1951లో స్థాపించిన ఈ సొసైటీ నేటికీ 728 మంది మెంబర్లతో సొసైటీ లాభాల బాటలో నడిపించడానికి సొసైటీ సభ్యులకు సహకారంతో ముందుకు నడుస్తూ స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను రైతులకు అందించడంలో సీఈఓ నారాయణ రావు తన వంతు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడు నల్లి శివకుమార్ మాట్లాడుతూ పాలకవర్గం ఎన్నికల జరిపి సుమారు ఏడేళ్లు అయిందని ప్రస్తుతం సొసైటీకి పాలకవర్గం లేకపోవడం వల్ల వివిధ అవకతవకలు జరిగే పరిస్థితి ఉంటుందని ప్రభుత్వం తక్షణమే సొసైటీలకు ఎన్నికలు జరిపించి సమర్థవంతమైన పాలకవర్గంతో సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ దేశినీడి ఉదయభాస్కరరావు సొసైటీ మాజీ అధ్యక్షుడు చొప్పల రాజేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు మేడిచర్ల వెంకట్ రాజు, సత్యనారాయణ, రావి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సీఈఓ నారాయణరావు

## ఉత్తమ ఫలితాలు సాధించాలి

**కొత్తపేట:** విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించే లక్ష్యంతో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ముందుకు వెళ్లాలని స్థానిక లీగల్ సెల్ సీనియర్ న్యాయవాదులు అల్లు భాస్కరరావు, డి.బాల ప్రతాప్ సూచించారు. ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ఉత్తర్వులను అనుసరించి స్థానిక లీగల్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజుఅధ్యక్షతన జరిగిన సదస్సులో లీగల్ సెల్ సీనియర్ న్యాయవాదులు అల్లు భాస్కరరావు (ప్యానల్ లాయర్) డి.బాల ప్రతాప్ వివిధ చట్టాల గురించి వివరించారు. విద్యార్థి దశలో ఉన్న యువతకు స్వీయరక్షణ ఎంతో అవసరమని వారి తమ దృష్టిని చదువుపై కేంద్రీకరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులు, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ సీహెచ్ నాగరాణి, మహిళా అధ్యాపకులు ఎ.దీపికదేవి, వి.నాగ దీపిక, సీహెచ్ నాగ శ్రీలక్ష్మి, కోర్టు సిబ్బంది నక్కా కృష్ణ, ఎం.సూర్య తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేట డిగ్రీ కళాశాల సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది బాలప్రతాప్

## జ్వర పీడితుల వివరాలు సమగ్రంగా ఉండాలి

**అంబాజీపేట:** గ్రామంలో ప్రతి ఇంటినీ సర్వే చేసి జ్వర పీడితుల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారం దంగేటివారిపాలెంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు పర్యవేక్షణలో కమ్యూనిటీ హెల్త్ అధికారి బి.అప్పారావు, సబ్ యూనిట్ అధికారి ఎస్‌వీ రామారావుల ఆధ్వర్యంలో యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణం కారణంగా ప్రతి ఒక్కరూ రోగాల బారిన పడుతున్నారన్నారు. అలాగే దోమల ఉధృతి అధికంగా ఉందని వాటి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. నివాస ప్రాంతాల్లో ఉన్న మురుగు కాలువలు, డ్రైనేజీలు, చెత్తా చెదారాన్ని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమల ఉధృతి లేకుండా ప్రత్యేకశ్రద్ధ తీసుకుని నివారించాలన్నారు. దోమల వల్ల విష జ్వరాలతో పాటు డెంగీ, మలేరియా తదితర వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. అనంతరం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అంతకు ముందు డెంగీ వ్యాధి బారిన పడిన పద్మ కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. అక్కడ జరుగుతున్న మెడికల్ క్యాంపును పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జి.అగ్రహారంలో మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న మలేరియా అధికారి వెంకటేశ్వరరావు

## అగ్నిప్రమాద బాధితుడికి రెడ్ క్రాస్ చేయూత

**సఖినేటిపల్లి:** మండలంలోని గొంది గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన పంతాడి నూకరాజు కుటుంబానికి శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా చేయూత నిచ్చింది. సొసైటీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశాల మేరకు, సొసైటీ జిల్లా చైర్మన్ కె.సత్యనారాయణ సూచనలతో చేయూతనిచ్చారు. ఈ మేరకు రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల రెడ్ క్రాస్ సొసైటీ సమన్వయకర్త జంపన బుజ్జిరాజు చేతుల మీదుగా బాధితుడికి టార్పాలిన్, వంట సామగ్రి, ఉలెన్ బ్లాంకెట్, బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. ఐఆర్ఎస్ సహాయ కార్యదర్శి బోణం రాజు, మెంబర్స్ డి.శ్రీహరిరాజు, తాడి సహదేవ్, వైస్ ఎంపీపీ-1 కొల్లాబత్తుల నాని, వీఆర్వో రామకృష్ణ, ఫీల్డ్ కో ఆర్డినేటర్ రత్నప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గొందిలో అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం చేస్తున్న బుజ్జిరాజు

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

**ఆలమూరు:** పవిత్రతకు, ఆత్మీయ, అనురాగాలకు ప్రతీకగా పవిత్ర రంజాన్ మాసం నిలుస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని పెదపళ్లలోనున్న మసీదులో శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందుకు ప్రత్యేకత ఉంటుందన్నారు. పవిత్రమైన ఉగాది, రంజాన్ పండుగలు పక్క,పక్కనే రావడం మతసామరస్యానికి ప్రతీక అన్నారు. అన్ని మతాలు శాంతి, సామరస్యాన్ని బోధిస్తాయని, అంతిమంగా మానవత్వాన్ని వెల్లడిస్తాయని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. జాస్తి భాస్కరరావు, సలాది నాగేశ్వరరావు, ముస్లీం పెద్దలు పాల్గొన్నారు.

**ఎస్టీయూ ఆధ్వర్యంలో..**

**మామిడికుదురు:** ఎస్టీయూ మామిడికుదురు మండల శాఖ ఆధ్వర్యంలో మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో మండల శాఖ అధ్యక్షుడు కారుపల్లి కల్యాణ్‌బాబు సారథ్యంలో ముస్లిం ఉపాధ్యాయులకు గురువారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. విద్యాశాఖ జేడీ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) మువ్వా రామలింగం, డీఈఓ షేక్ సలీం బాషా, డీసీఈబీ డైరెక్టర్ బీరా హనుమంతరావు, డీవైఈఓ గుబ్బల సూర్యప్రకాశరావు, జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, రాష్ట్ర కన్వీనర్ మట్టా నాగరాజు, మండల శాఖ ప్రధాన కార్యదర్శి కొమ్ముల వీరరాఘవరావు పాల్గొన్నారు.



మామిడికుదురులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న జేడీ, డీఈఓ

## మహిళా సంఘాలకు క్రెడిట్ ప్లాన్‌పై శిక్షణ

**అయినవిల్లి:** స్వయం సహాయక సంఘ సభ్యులకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో అవసరమైన జీవనోపాదులు, ఋణాలపై ఎంపిక చేసిన ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇస్తున్నట్లు వెలుగు సెర్ప్ మండల ఏపీఎం ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గత రెండు రోజుల నుంచి గ్రామ సమాఖ్య సహాయకులకు, ఎన్యుమరేటర్లకు శిక్షణ జరుగుతుంది. మండలంలో ఉన్న డ్వాక్రా సంఘాలను ఒక యూనిట్‌గా తీసుకొని ప్రతి ఐదు సంఘాలకు చదువుకున్న ఎన్యుమరేటర్లను గుర్తించామన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు క్షేత్రస్థాయిలో సంఘ సభ్యుల వద్దకు వెళ్లి మొబైల్ యాప్ ద్వారా కుటుంబ అవసరాలకు కావలసిన ఋణ ప్రణాళిక తయారు సిద్ధం చేస్తున్నామన్నారు. సెర్ప్ సీఈవో, డీఆర్డీఏ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు 2025–26కి ఋణప్రణాళిక అంచనా తయారు చేశామని ఏపీఓ తెలిపారు. ఈ శిక్షణలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.సత్యాదేవి, కార్యదర్శి పి.సత్యవతి, కోశాధికారి పి.ప్రశాంతి, సీసీ వెంకటలక్ష్మి, అకౌంటెంట్ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం వెంకటేశ్వరరావు

## డ్రెడ్జింగ్ హార్బర్ స్థల పరిశీలన

**సఖినేటిపల్లి:** అంతర్వేదికర, కేశవదాసుపాలెం గ్రామాల్లోని తీరం వెంబడి 2017లో డ్రెడ్జింగ్ హార్బర్ కం ట్రెయినింగ్ సెంటర్‌కు కేటాయించిన స్థలాలను శుక్రవారం అమలాపురం ఆర్డీఓ కె.మాధవి పరిశీలించారు. అప్పట్లో తీరం వెంబడి సుమారు 200 ఎకరాలు డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌కు రెవెన్యూ శాఖ కేటాయించినట్టు తహసీల్దార్ ఎం .వెంకటేశ్వరరావు వివరించారు. ఈ మేరకు కేటాయించిన భూముల గురించి రికార్డు పరంగా సర్వేయర్ భద్రరావు, ఆర్డీఓకు వివరించారు. కాగా భూముల వాస్తవ పరిస్థితి క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసేందుకు ఆర్డీఓ ఈ పర్యటన చేపట్టినట్టు సమాచారం. ఇదిలా ఉండగా తీరం వెంబడి పెరుగు భూములను డ్రెడ్జింగ్ హార్బర్‌కు తీసుకుంటే వాటిపైనే ఆధారపడి ఉన్న తమకు నష్టపరిహారం మంజూరు చేయించాలని స్థానిక రైతులు, ఆర్డీఓను కోరారు. డీటీ సీహెచ్.భాస్కర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కేశవదాసుపాలెం తీరంలో భూముల గురించి ఆర్డీఓకు వివరిస్తున్న సర్వేయర్

### రాజోలు బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన రాజోలు బార్ అసోసియేషన్ కమిటీ

**రాజోలు:** రాజోలు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, మాజీ ఏజీపీ యర్రంశెట్టి అయ్యప్పనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి పదవికి పోలింగ్ నిర్వహించగా న్యాయవాది చింతా ప్రసాద్ విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా యాలంగి రమేష్, కోశాధికారిగా మెడబల రాజ్‌కుమార్, కార్యదర్శులుగా గంటి రవికుమార్, నీతిపూడి సత్యనారాయణ, లైబ్రేరియన్ కార్యదర్శిగా సిర్రా వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడిగా బలగ ప్రేమ్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, సీనియర్ న్యాయవాది పొన్నాడ సూర్యారావు తదితరులు కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

### నగరం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా లక్ష్మి



**మామిడికుదురు:** పి.గన్నవరం నియోజకవర్గం నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా మామిడికుదురు మండలం మొగలికుదురు గ్రామానికి చెందిన పెనుమాల లక్ష్మిని నియమించారు. దీనికి సంబంధించి శుక్రవారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు కేటాయించారు. పెనుమాల లక్ష్మి జనసేనకు పార్టీ మహిళ. పి.గన్నవరం ఎమ్మెల్యే జనసేనకు చెందిన గిడ్డి సత్యనారాయణ సిఫారసు మేరకు లక్ష్మిని చైర్‌పర్సన్‌గా నియమించారు. చైర్‌పర్సన్ నియామకం పూర్తి కావడంతో ఇక నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి కసరత్తు ప్రారంభించారు.

### కిక్ బాక్సింగ్‌లో మోహన్‌రాజ్‌కు రజతం



విద్యార్థి మోహన్‌రాజ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సాయిబాబు

**రాజోలు:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బి.మోహన్‌రాజ్ కిక్ బాక్సింగ్‌లో రజత పతకం సాధించాడు. ఈ మేరకు శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ పి.సాయిబాబు ఆధ్వర్యంలో విద్యార్థి మోహన్‌రాజ్‌ను అభినందించారు. ఈ నెల 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో స్వామి వివేకానంద సుభార్తి యూనివర్శిటీలో పోటీలు నిర్వహించారన్నారు. ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ స్థాయిలో జరిగిన కిక్ బాక్సింగ్ పోటీల్లో 75 కేజీల పోయింట్ ఫైట్ కేటగిరిలో మోహన్‌రాజ్ రజతం సాధించారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, స్పోర్ట్స్ ఇన్‌చార్జి నల్లి రాజు, పీడీ మధుకుమార్, శైలజ, అశ్విని, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

### దుర్యోధనుడి పాత్రధారి 'రమేష్'కు సత్కారం



న్యాయవాది రమేష్‌ను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వేమా

**రాజోలు:** పౌరాణిక నాటకాల్లో దుర్యోధనుడి పాత్రధారి, న్యాయవాది యాలంగి రమేష్‌ను మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా శుక్రవారం సత్కరించారు. అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం పురస్కరించుకుని న్యాయవాది రమేష్‌ను సన్మానించారు. నాటక రంగం నిర్వీర్యం కాకుండా పలు ఉత్సవాల్లో దుర్యోధనుడు, మాయల ఫకీర్ వంటి పాత్రలతో ప్రేక్షకుల మన్ననలు పొందుతున్నారన్నారు. న్యాయవాదులు పొన్నాడ సూర్యారావు, జాలెం భాస్కరరావు, యర్రంశెట్టి అయ్యప్ప నాయుడు, రాపాక నరసింహస్వామి పాల్గొన్నారు.

### జుమ్మతుల్ విధా ప్రార్థనలు

**మామిడికుదురు:** పవిత్ర రంజాన్ నెలలో చివరి శుక్రవారం (జుమ్మతుల్ విధా) ప్రార్థనలు మసీదుల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కఠోర నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలు చివరి శుక్రవారం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మామిడికుదురు షియా జామియా మసీదులో షబ్బర్ అలీ జైదీ, సున్నీ జామియా మసీదులో తారిఖ్ అన్వర్ రజ్వీ చివరి శుక్రవారం ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు జుమ్మ తుల్ విధా ప్రార్థనల్లో పాల్గొన్నారు. రంజాన్ నెలలో ఉపవాస దీక్షల ద్వారా పాపాల నుంచి పునీతులవుతారని చెప్పారు. అల్లా మాసంగా పిలిచే రంజాన్ నెలలో దాన, ధర్మాలు చేయాలని సూచించారు.